


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com


4PM

www.suryaa.com

శుక్రవారం

12-09-2025

పేజీలు: 02



## భారత 15వ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

భారత 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన చేత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎన్డీయే కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా హాజరయ్యారు. ఇటీవలే జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాధాకృష్ణన్ గెలుపొందిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన ఎన్నికలో ఆయనకు 452 ఓట్లు రాగా, విపక్షానికి చెందిన ఆయన ప్రత్యర్థి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు లభించాయి. 152 ఓట్ల తేడాతో ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఆయన నిన్న మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.ఆర్ఎస్ఎస్, జన్‌సంఘ్ లాంటి సంస్థలతో 16 ఏండ్లకే రాధాకృష్ణన్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా, 2003 నుంచి 2006 మధ్య అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన రాష్ట్రంలో 93 రోజుల పాటు 19 వేల కి.మీ రథయాత్ర నిర్వహించారు. 2024, జూలై 31న ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జార్ఖండ్ గవర్నర్‌గా ఏడాదిన్నర పాటు చేశారు. తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ పనిచేశారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా చేశారు. అభిమానులు ఆయనను తమిళనాడు మోదీగా పిలుస్తారు.





## వైఎస్ఆర్ వారసుడు రాజారెడ్డే అని తేల్చేసిన షర్మిల

ఇటీవల ఏపీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో షర్మిల వెంట ఆయన తనయుడు కనిపిస్తూ ఉండటంతో.. అతని పొలిటికల్ ఎంట్రీపై ఆసక్తికర చర్చ జరుగుతుంది. తన కుమారుడు సమయం వచ్చినప్పుడు రాజకీయ రంగప్రవేశం చేస్తాడని.. షర్మిల బహిరంగంగానే ప్రకటించారు. దీంతో రాజారెడ్డి వైఎస్సార్ వారసుడు అంటూ.. షర్మిల అనుచరులు భావిస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో ఓ వర్గం నుంచి ట్రోల్స్ కూడా మొదలయ్యాయి. ఈ క్రమంలో వైఎస్ షర్మిల ఘాటుగా స్పందించారు. వైఎస్ రాజారెడ్డి నిజమైన వైఎస్సార్ రాజకీయ వారసుడేనని, దీని విషయంలో ఎలాంటి అనుమానం లేదని ఆమె స్పష్టం చేశారు. ''నా కొడుకు ఇప్పటివరకు రాజకీయాల్లో అడుగు కూడా పెట్టలేదు. పెట్టక ముందే వైసీపీ ఇంత గందరగోళం సృష్టిస్తుంటే_ _ _ ఇది భయమా ? లేక బెదిరింపా ? వాళ్లకే తెలిసిన విషయం. నా కుమారుడికి 'వైఎస్ రాజారెడ్డి' అనే పేరు స్వయంగా నా నాన్నగారు వైఎస్సార్ పెట్టారు. వైసీపీ ఎంత కేకలు వేసినా, ఎన్ని అడ్డంకులు పెట్టినా ఈ పేరును ఎవ్వరూ మార్చలేరు'' అని షర్మిల గట్టిగా చెప్పారు. చంద్రబాబు చెప్తేనే.. తన కొడుకును రాజకీయాల్లోకి తీసుకొచ్చినట్లు ఓ వీడియోను మార్ఫ్ చేసి ప్రచారం చేస్తున్నారని_ _ _ అది చూసి తనకు నవ్వు వచ్చిందన్నారు షర్మిల. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో జగన్ వైఖరిని టార్గెట్ చేస్తూ షర్మిల నిలదీశారు. వైఎస్సార్ జీవితాంతం BJP, RSSలను వ్యతిరేకించారని.. కానీ ఆయన కొడుకే RSS అభ్యర్థికి మద్దతు ఇవ్వడం అవమానకరమన్నారు. రాజ్యాంగం గురించి లోతుగా తెలిసిన న్యాయ నిపుణుడు సుదర్శన్ రెడ్డికి ఎందుకు మద్దతు ఇవ్వలేదు ? జగన్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అదానీ, రిలయన్స్ వ్యవహారాలను ప్రస్తావిస్తూ షర్మిల విమర్శలు గుప్పించారు. ''వైఎస్సార్ మరణం వెనుక రిలయన్స్ కుట్ర ఉందని జగన్ చెప్పాడు. కానీ అదే రిలయన్స్ వారికి రాజ్యసభ సీటు ఇచ్చాడు. అదానీ కోసం గంగవరం పోర్ట్‌ను త్యాగం చేశాడు. ఐదు ఏళ్ల అధికారంలో BJP ప్రతీ బిల్లుకు జగన్ మద్దతు ఇచ్చాడు. ఇప్పుడు ఏ ముఖంతో ఈ మద్దతు ఇస్తున్నారో జగన్ సమాధానం చెప్పాలి,'' అని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రంలో BRS నిశ్శబ్దంగా ఉండగా, వైసీపీ మాత్రం BJPకు ఓటు వేసిందని ఆమె మండిపడ్డారు. టీడీపీ-జనసేన పొత్తు బహిరంగమని, కానీ జగన్ BJPతో రహస్య ఒప్పందం చేసుకున్నాడని షర్మిల ఆరోపించారు.




## మిరాయ్ రివ్యూ

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జ నుంచి వచ్చిన మరో ఇంట్రెస్టింగ్ చిత్రమే ''మిరాయ్''. భారీ విజువల్స్ తో ప్లాన్ చేసిన ఈ సినిమా ఈగల్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని నుంచి మరో ప్రాజెక్ట్ గా వచ్చింది. మరి ఈ సినిమా అంచనాలు అందుకుందో లేదో సమీక్షలో చూద్దాం రండి. కళింగ యుద్ధం తర్వాత ఎంతో పశ్చాత్తాపానికి లోనైన అశోకుడు తనలోని శక్తులని మొత్తం 9 గ్రంథాలు (ఒకో గ్రంథానికి ఒకో దివ్య శక్తి కలిగి ఉంటుంది) లోకి ఇమిడింపజేసి ప్రపంచ నలు మూలాల ఉన్న 9 మంది రక్షకులకి అందిస్తాడు. అక్కడ నుంచి ప్రస్తుత కాలానికి ఒకో గ్రంథాన్ని చేజిక్కించుకొని తాను భగవంతునిగా మారాలని చూసే క్రూరుడు మహావీర్ (మంచు మనోజ్) ప్రయత్నిస్తాడు. అలా తొమ్మిదో గ్రంథం అంబిక (శ్రియా శరన్) రక్షలో ఉంటుంది. మరి దానికి తన కొడుకు వేద (తేజ సజ్జ) ఎలా రాముని కాలానికి చెందిన మిరాయ్ ని చేజిక్కించుకొని రక్షకుడిగా మారాడు. తాను వేద నుంచి యోధ గా ఎలా పరిణామం చెందాడు ? ఈ క్రమంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి ? చివరికి ఆ తొమ్మిదో గ్రంథం మహావీర్ కి దక్కకుండా చేశాడా లేదా ? అసలు ఆ మిరాయ్ ఏంటి ? మహావీర్ గతం ఏంటి అనేవి తెలియాలి అంటే ఈ సినిమా చూడాలి. మొదటిగా దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఎంచుకున్న కథ తన విజన్ ఈ సినిమాలో గ్రాండ్ గా కనిపిస్తాయి. ఒక ఇంట్రెస్టింగ్ నేపథ్యాన్ని తాను ఎంచుకొని ఒక గ్రాండ్ ట్రీట్ ఇచ్చే ప్రయత్నం తాను చేయడం హర్షణీయం. ముఖ్యంగా తన శక్తికి మించి పెట్టిన ఎఫర్ట్స్ భారీ విజువల్స్ అందులో డివోషనల్ గా ఇచ్చిన ఎలివేషన్స్ లో తన విజన్ కనిపిస్తుంది. ముఖ్యంగా సప్తపది గరుడ ఎపిసోడ్స్ నెక్స్ట్ లెవెల్లో ఉంటాయి. ఆ విజువల్ ఎఫెక్ట్స్ మాత్రం బిగ్ స్క్రీన్ పై సాలిడ్ గా కనిపిస్తాయి. అలాగే తేజ సజ్జ రోల్ నీట్ గా వెళుతుంది. తన అడ్వెంచరస్ ప్రయాణం అందులోని సవాళ్లు నీట్ గా డిజైన్ చేసుకున్నారు. తన పాత్రకి తేజ సరిగ్గా కుదిరాడు. మంచి లుక్స్ అండ్ ఎమోషన్స్ ని తాను పండించాడు. యాక్షన్ పార్ట్ లో అయితే అదరగొట్టాడని చెప్పవచ్చు. అలాగే మంచు మనోజ్ ఈ పాత్రని ఎందుకు ఎంచుకున్నాడో సమాధానం ఈ సినిమాలో గట్టిగా కనిపిస్తుంది. తాను ఈ సినిమాలో రోల్ ని చాలా ఛాలెంజింగ్ గా కూడా చేశారు. కొన్ని ఇబ్బందికర సన్నివేశాలని సైతం మనోజ్ చేయడం తన గట్స్ ని మరోసారి ప్రూవ్ చేస్తుంది. ముఖ్యంగా తనపై శబ్ద గ్రంథం యాక్షన్ ఎపిసోడ్ కంప్లీట్ డిఫరెంట్ గా ఉంటుంది. బహుశా ఇలాంటి ఎపిసోడ్ ఇండియన్ సినిమా దగ్గర ఇది వరకు వచ్చి కూడా ఉండకపోవచ్చు. అది చాలా యునిక్ గా అనిపిస్తుంది. వీరితో పాటుగా శ్రియా శరన్ కి సాలిడ్ రోల్ దక్కింది. అంబిక పాత్రలో శ్రియ బాగా చేశారు. అలాగే నటుడు జైరాం కూడా మంచి పాత్రలో కనిపించి మెప్పించారు. జగపతిబాబు, హీరోయిన్ రితికా సింగ్ లు బలమైన పాత్రల్లో కనిపించి వారికి ఉన్న ముఖ్య సన్నివేశాల్లో బాగా చేశారు. గెటప్ శ్రీను రోల్ బాగుంది మంచి కామెడీ సీన్స్ వర్కౌట్ అయ్యాయి. ఈ సినిమాలో ప్రధానాంశం బాగున్నప్పటికీ కథనం ఇంకాస్త గ్రిప్పింగ్ గా తీసుకెళ్లి ఉంటే బాగుండేది. అప్పటికే వైబ్ ఉంది లాంటి సాంగ్స్ ని తీసేసినప్పటికీ కథనం అలా సాగుతున్న ఫీల్ కలుగుతుంది. ఫస్టాఫ్ లో తెలుగు నటులు, తేజ, గెటప్ శ్రీను ఇంకొందరు తెలుగు నటులు తప్పితే మిగతా నటీనటులపై సన్నివేశాలు చూస్తే ఇది తెలుగు సినిమా చూసినట్టే అనిపించదు మన నుంచి తెరకెక్కిన డబ్బింగ్ సినిమా ఫీల్ అనిపిస్తుంది. ఈ అడ్వెంచరస్ డ్రామాలో పలు ఎపిసోడ్స్ ఇది వరకే మనం చూసిన ఈ తరహా సినిమాలని కూడా గుర్తు చేయక మానవు. సో అవీ రొటీన్ ఫీల్ కలిగిస్తాయి. ముఖ్యంగా ఈగల్ లాంటి సాలిడ్ వర్క్ ని అందించిన కార్తీక్ నుంచి ఇంకా ఏదో సర్ప్రైజింగ్ ఎలిమెంట్స్ ని ఆశించినవారు కొంతమేర నిరాశ చెందవచ్చు. అలాగే క్లైమాక్స్ ఇంకొంచెం ఎంగేజింగ్ గా ఎండ్ చేసి ఉంటే బాగుండేది. ఈ సినిమా నిర్మాణ విలువలు మాత్రం ఎక్స్ట్రార్డినరీగా ఉన్నాయని చెప్పవచ్చు. తక్కువ బడ్జెట్ లోనే సాలిడ్ ప్రాజెక్ట్ లు చేయొచ్చు అని చూపించడానికి మిరాయ్ ని మరో చక్కటి ఉదాహరణగా చెప్పొచ్చు అనే విధంగా మేకర్స్ తీర్చి దిద్దారు. సినిమాలో యాక్షన్ పార్ట్ కానీ విజువల్ ఎఫెక్ట్స్ పనితీరు గాని సాలిడ్ గా ఉన్నాయి. ఈ రేంజ్ అవుట్ పుట్ ని అయితే చాలామంది ఊహించి కూడా ఉండకపోవచ్చు. అలాగే హను మాన్ సంగీత దర్శకుడు గౌర హరి ఈ సినిమాకి కూడా మంచి డ్యూటీ చేశారు. ఆయా సన్నివేశాలని తన నేపథ్య సంగీతంతో మరింత పవర్ఫుల్ గా ఎలివేట్ చేశారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేనే కెమెరా వర్క్ కూడా అందించారు. తన వర్క్ ఇందులో స్టన్నింగ్ గా ఉంది. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ డీసెంట్ గా ఉంది. ఇక కార్తీక్ దర్శకత్వ పనితీరు విషయానికి వస్తే.. తాను ఎంచుకున్న కథ, గ్రాండ్ విజన్ బాగున్నాయి. అంధుడు తగ్గట్టుగా ప్లాన్ చేసుకున్న మూమెంట్స్ కూడా ఇంప్రెస్ చేస్తాయి. కాకపోతే ఈ కథనం కొన్ని చోట్ల మాత్రం ఇంకా బెటర్ గా గ్రిప్పింగ్ గా డిజైన్ చేయాల్సింది. ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ ''మిరాయ్'' టాలీవుడ్ నుంచి మరో ఇంప్రెస్ చేసే కొత్త ప్రయత్నం అని చెప్పవచ్చు.

మంచి అడ్వెంచరస్ డ్రామాలు అందులో మైథలాజి, హిస్టారికల్ ఎలిమెంట్స్ తో సాలిడ్ యాక్షన్ సహా హై మూమెంట్స్ ఎపిసోడ్స్ లాంటివి ఇష్టపడేవారికి మిరాయ్ సాలిడ్ ట్రీట్ ని అందిస్తుంది. ముఖ్యంగా తేజ సజ్జ, మనోజ్ లు తమ రోల్స్ లో అదరగొట్టారు. అలాగే దర్శకుడు విజన్ తన ప్రయత్నంకి మరిన్ని మార్కులు ఇవ్వొచ్చు. సో ఈ చిత్రాన్ని బిగ్ స్క్రీన్స్ పై ఎంజాయ్ చేయవచ్చు.

## కిష్కింధపురి రివ్యూ

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా నటించిన తొలి హారర్ చిత్రం 'కిష్కింధపురి'. అనుపమ కథానాయిక. కాగా ఈ చిత్రం ఈ రోజు విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఈ చిత్రం ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం ! రాఘవ్ (బెల్లంకొండ సాయిశ్రీనివాస్), మైథిలి (అనుపమ) ఇద్దరు ప్రేమలో ఉంటారు. పైగా ఇద్దరు కలిసి ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌసెస్ టూర్స్ చేస్తుంటారు. థ్రిల్ కోరుకునే వాళ్లందరినీ కలిపి ఓ పాడుబడిన బంగ్లాల్లోకి తీసుకెళ్లి అక్కడ దెయ్యాలు ఉన్నాయని నమ్మిస్తూ థ్రిల్ పంచడమే ఆ టూర్ ఉద్దేశం. అలా ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ సంఘటనల ఆధారంగా కిష్కింధపురి అనే ఊరి పరిసరాల్లో ఉన్న సువర్ణమాయ అనే రేడియో స్టేషన్‌కి వెళ్తారు. 1989లోనే పాడుబడిన స్టేషన్ అది. అందులో దెయ్యం ఉంటుంది. ఇంతకీ, ఆ దెయ్యం ఎవరు ?, ఎందుకు అందర్నీ చంపేస్తాను అని వార్నింగ్ ఇస్తుంది ?, రాఘవ్ తన ప్రాణాల్ని అడ్డుపెట్టి దెయ్యానికి ఎందుకు ఎదురెళ్లాడు ? అనేది మిగిలిన కథ. అసూయ, ద్వేషంతో చనిపోయిన వ్యక్తి ఆత్మ పగతో రగిలిపోతూ.. మనుషుల ప్రాణాలు తీయడానికి ఎదురుచూస్తూ ఉంటే ఎలా ఉంటుంది ? అనే కాన్సెప్ట్ తో వచ్చిన ఈ యాక్షన్ హారర్ రివేంజ్ డ్రామాలో కొన్ని ఎమోషన్స్ అండ్ మెయిన్ కథాంశం బాగున్నాయి. అలాగే ఈ ''కిష్కింధపురి'' సినిమాలో కోర్ పాయింట్ కూడా బాగుంది. ఈ సినిమాలో ప్రధాన పాత్ర అయిన రాఘవ పాత్ర .. ఆ పాత్రకి సంబంధించిన ఘోస్ట్ వాకింగ్ ట్రాక్.. అలాగే ఆ పాత్రతో ముడి పడిన అనుపమ పాత్ర.. ఇలా మొత్తానికి 'కిష్కింధపురి' సినిమా ఆకట్టుకుంది. ఈ సినిమాలో హీరోగా నటించిన బెల్లకొండ సాయి శ్రీనివాస్ తన పాత్రకు తగ్గట్లు బాగా నటించాడు. తన యాక్షన్ అండ్ వాయిస్ తో అద్భుతంగా మెప్పించాడు. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ తన రియలిస్టిక్ యాక్టింగ్ తో ఆకట్టుకుంది. అలాగే, మరో కీలక పాత్రలో నటించిన తనికెళ్ల భరణి కూడా బాగా నటించారు. శ్రీకాంత్ అయ్యంగార్ నటన బాగుంది. ఇక హైపర్ ఆది, శాండీ మాస్టర్, మర్కంద్ దేశ్‌పాండే, హినా భాటియాలతో పాటు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్ర పరిధి మేరకు బాగా నటించారు. ముఖ్యంగా సీనియర్ కథానాయిక ప్రేమ నటన ఆకట్టుకుంటుంది. డీ గ్లామర్‌గా కనిపిస్తూ ఆమె తల్లి పాత్రకి ప్రాణం పోశారు. దర్శకుడు కౌశిక్ ఓ కొత్త నేపథ్యంలోనే కథని రాసుకున్న విధానం ఆకట్టుకుంది. మెయిన్ గా హారర్ సన్నివేశాలను డీల్ చేసిన విధానం చాలా బాగుంది. అలాగే, పతాక సన్నివేశాల్లోని మలుపులు బాగున్నాయి. దెయ్యాలు, ఆత్మల కథలు తెలుగు సినిమాకి కొత్తేమీ కాదు. కానీ, ఈ సినిమాలో కొన్ని చోట్ల కొత్త ఎలిమెంట్స్ ను పెట్టడం బాగుంది. దీనికి తోడు, 'కిష్కింధపురి'లోని హారర్ ఎఫెక్ట్స్ కూడా బాగున్నాయి. అయితే, కథనంలో కొన్ని చోట్ల కీలక సన్నివేశాలు స్లోగా సాగడం, అలాగే.. సినిమా మొదట్లో కాన్ ఫ్లిక్ట్ ఆకట్టుకునే విధంగా లేకపోవడం వంటి అంశాలు సినిమాకి మైనస్ పాయింట్స్ గా నిలిచాయి. అయితే, దర్శకుడు ఫస్ట్ హాఫ్ పై ఆసక్తిని కలిగించే ప్రయత్నం చేసినప్పటికీ_ _ _ అదే విధంగా అతను రాసుకున్న కాన్సెప్ట్ బాగున్నప్పటికీ.. సినిమాలో కొన్ని చోట్ల లాజిక్ మిస్ అయింది. మొత్తానికి కథనం విషయంలో దర్శకుడు ఇంకా బాగా కసరత్తులు చేసి ఉంటే సినిమా మరో స్థాయిలో ఉండేది. సినిమాలో చెప్పాలనుకున్న హారర్ ఎలిమెంట్స్ అండ్ ఎమోషనల్ కంటెంట్ కూడా బాగుంది. కథనం ఇంకా ఆసక్తికరమైన ప్లోతో ఉంటే సినిమాకి బాగా ప్లస్ అయ్యేది. మొత్తానికి కౌశిక్ పెగళ్లపాటి దర్శకుడిగా ఆకట్టుకున్నాడు. ఇక సంగీత దర్శకుడు చైతన భరద్వాజ్ సమకూర్చిన పాటలు పర్వాలేదు. సినిమాటోగ్రఫీ విషయానికి వస్తే.. లొకేషన్స్ అన్ని న్యాచురల్ విజువల్స్ తో ఆకట్టుకున్నాయి. కెమెరామెన్ చిన్మయ్ సలాస్కర్ సీన్స్ ను తెరకెక్కించిన విధానం బాగుంది. నిరంజన్ దేవరమనే ఎడిటింగ్ కూడా పర్వాలేదు. ఈ చిత్ర నిర్మాత సాహు గారపాటి పాటించిన నిర్మాణ విలువలు బాగున్నాయి. 'కిష్కింధపురి' అంటూ వచ్చిన ఈ హారర అండ్ ఎమోషనల్ రివేంజ్ డ్రామాలో.. హారర్ అండ్ యాక్షన్



ఎలిమెంట్స్ తో పాటు పాత్రల తీరు, అలాగే వాటి ఎమోషన్స్ కూడా బాగున్నాయి. బెల్లకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ల నటన కూడా సినిమా స్థాయిని పెంచింది. ఐతే, కొన్ని చోట్ల ప్లే స్లోగా సాగడం, సెకండ్ హాఫ్ లో కొన్ని సీన్స్ లో ఇంట్రెస్ట్ మిస్ అయింది. ఓవరాల్ గా ఈ సినిమా మాత్రం ఆకట్టుకుంది.



## 1500 కుటుంబాలకు సాయం... మరోసారి గొప్ప మనసు చాటుకున్న షారుఖ్ ఖాన్

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంజాబ్ అతాలకుతలం అయిన విషయం తెలిసిందే. భారీ వరదలతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోగా.. వరదల తాకిడికి పలువురు చనిపోయారు. వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అయితే వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ తన వంతు సహాయం అందించారు. తన స్వచ్ఛంద సంస్థ 'మీర్ ఫౌండేషన్' ద్వారా వరద బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. షారుఖ్ ఖాన్ ఛారిటీ సంస్థ అయిన మీర్ ఫౌండేషన్, పంజాబ్‌లోని స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి సహాయ కార్యక్రమాలను చేపట్టింది. అమృత్‌సర్, పాటియాలా, ఫాజిల్కా, ఫిరోజ్పూర్ వంటి వరద ప్రభావిత జిల్లాల్లోని 1500 కుటుంబాలకు పైగా సహాయ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో మందులు, ఆహార పదార్థాలు, దోమ తెరలు, టార్పాలిన్ షీట్లు, మడతపెట్టే పడకలు వంటి అత్యవసర వస్తువులను అందించారు. ఈ సహాయంతో బాధితుల తక్షణ ఆరోగ్య, భద్రత, మరియు ఆశ్రయం అవసరాలను తీర్చడానికి కృషి చేస్తున్నారు. మరోవైపు వరదలపై స్పందించిన షారుఖ్ ఖాన్ తన సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. ఈ కష్టకాలంలో పంజాబ్ ప్రజలకు నా హృదయం అండగా ఉంటుంది. వారికి నా ప్రార్థనలతో పాటు ధైర్యాన్ని పంపుతున్నాను. పంజాబ్ స్ఫూర్తి ఎప్పటికీ విచ్ఛిన్నం కాదు. దేవుడు వారందరినీ ఆశీర్వదించుగాక అని ఆయన పేర్కొన్నారు.

## 'ఓజి' ట్రైలర్ పై కొత్త బజ్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న అవైటెడ్ సినిమా "ఓజి" కోసం అందరికీ తెలిసిందే. భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎగ్జైటెడ్ గా ఎదురు చూస్తుండగా ఈ సినిమా ఆఫ్ లైన్ ప్రమోషన్స్ అలాగే ఒకే అప్డేట్ తో మరింత హైప్ ఎక్కిస్తున్నారు. ఇలా సినిమా ట్రైలర్ పై కొత్త బజ్ వినిపిస్తుంది. ముందు అయితే ఈ సెప్టెంబర్ 15న ట్రైలర్ వస్తుంది అన్నట్టు టాక్ వచ్చింది కానీ ఇపుడు ఈ డేట్ మారినట్టు తెలుస్తుంది. దీని ప్రకారం ఈ సెప్టెంబర్ 18న విడుదల చేస్తారట. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నాడు అలాగే ఇమ్రాన్ హష్మీ విలన్ గా నటిస్తుండగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## నేపాల్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా సుశీల కర్కీ..!



నేపాల్‌లో యువత చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. రాజకీయ నేతల అవినీతి, సోషల్ మీడియాపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ జన్ జడ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలతో హిమాలయ దేశం రగిలిపోతోంది. సోమవారం ప్రారంభమైన ఈ ఘర్షణల కారణంగా ఇప్పటి వరకూ 51 మంది మరణించినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. మృతుల్లో భారతీయ మహిళ కూడా ఉన్నారు. ఆమెను ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన మహిళగా గుర్తించారు. ఇక ఈ ఘర్షణల్లో సుమారు 1,500 మంది వరకూ గాయపడ్డారు. మరోవైపు నేపాల్‌లో తాత్కాలిక ప్రభుత్వ సారథి ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. తాత్కాలిక ప్రభుత్వ సారథి రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ప్రభుత్వ సారథి ఎంపిక విషయంలో జన్ జడ్ నిరసనకారుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఓ వర్గం వారు సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కీ పేరును ప్రతిపాదించగా.. మరో వర్గం నేపాల్ విద్యుత్ సంస్థ మాజీ ఎగ్జిక్యూటివ్ చీఫ్ కుల్మాన్ ఘీషింగ్ పేరును తాత్కాలిక ప్రభుత్వ సారథిగా వారు ప్రతిపాదించారు. వీరిద్దరిలో సుశీలా కర్కీని తాత్కాలిక ప్రధాన మంత్రిగా నియమించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.



### అర్ధరాత్రి కుక్కల బీభత్సం..

## మేకను కొరికి చంపిన శునకాలు

మక్తల్ మున్సిపాలిటీలో వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. మిగతా మూగ జీవాలపై దాడి చేసి చంపి భయాందోళనలు సృష్టిస్తున్నాయి. మక్తల్ పట్టణంలో వీధి కుక్కలు భారీ సంఖ్యలో సంచరిస్తుండడంతో పాటు, మనుషులపై దాడి చేస్తూ హడలెత్తిస్తున్నాయి. గురువారం రాత్రి మక్తల్ మున్సిపాలిటీలోని రాఘవేంద్ర థియేటర్ యాదవనగర్ మౌలాలి మసీద్ సమీపంలో మేక పై కుక్కలు దాడి చేసి చంపి తిన్నాయి. మేకపై దాడి చేస్తున్న కుక్కలను నియంత్రించడానికి పట్టణవాసి ఒకరు ప్రయత్నించగా అతడిపై తిరగబడటంతో భయంతో అక్కడి నుంచి పారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మక్తల్ మున్సిపల్‌లోని ప్రధాన రహదారి పై ఉన్న మటన్ మార్కెట్ వ్యాపారులు మటన్ వ్యర్థాలను సమీప షాపు వెనకాలనే పడేయడం వల్ల పదుల సంఖ్యలో కుక్కలు ప్రధాన రహదారిపై సంచరిస్తూ ఉంటాయి. రాత్రి సమయంలో ప్రధాన రహదారిపై వెళ్లాలంటేనే కుక్కల దాడి నుంచి భయాందోళనకు గురవుతున్నారు. కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ సిబ్బందితోపాటు, మున్సిపల్ అధికారులు విఫలం చెందడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి, పట్టణంలో కుక్కల లను తరలించేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో శబరి కాలనీలో చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి.



### జైలు శిక్షకు బదులు సమాజ సేవ..

## గద్వాల కోర్టు తొలి తీర్పు

గద్వాల జిల్లా కోర్టు ఆసక్తికర తీర్పును ఇచ్చింది. నూతన చట్టాన్ని అమలు చేస్తూ జైలు ( Jail ) కు బదులు సమాజసేవ చేపట్టాలని సదరు వ్యక్తికి తొలి తీర్పునిచ్చింది. జిల్లాలోని కేటి దొడ్డి మండలం ఉమ్మిత్యాల గ్రామానికి చెందిన ఈరన్న (30) అనే వ్యక్తి నందిన్నె గ్రామం ప్రధాన రోడ్డు పక్కన మద్యం సేవిస్తూ పోలీసులకు చిక్కాడు. అదుపులోకి తీసుకున్న అతడిని స్థానిక ఎస్సై బిజ్జా శ్రీనివాసులు కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరపరిచారు. ఈ కేసు విచారణ సందర్భంగా కోర్టులో హాజరైన నిందితుడు ఈరన్న తన తప్పును అంగీకరించాడు. భారత న్యాయ సురక్షా స్మృతి చట్టంలోని 355వ సెక్షన్ ఉపయోగిస్తూ గద్వాల మొదటి అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉదయ్ నాయక్ జైలు శిక్షకు బదులుగా సమాజ సేవ విధిస్తూ తీర్పునిచ్చారు. తీర్పు ప్రకారం, నిందితుడు ఈనెల 12న ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రి జంక్షన్ వద్ద ' మత్తులో వాహనం నడపవద్దు' అని రాసిన ప్లకార్డు పట్టుకుని నిలబడి మద్యం మత్తులో వాహనాలు నడిపే వారికి హెచ్చరికలు వెళ్లేలా చూడాలని , శిక్ష దండన రూపంలో కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలి. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కలిగించడం అవసరంమని న్యాయమూర్తి ఉదయ నాయక్ తీర్పులో పేర్కొన్నారు.



## కంగనా రనౌత్‌కు సుప్రీంకోర్టు చీవాట్లు

బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు సుప్రీంకోర్టు చురకలు వేసింది. తనపై నమోదైన క్రిమినల్ డిఫమేషన్ కంప్లయింట్‌ను కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. కంగనా తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచించింది. దాంతో కంగనా రనౌత్ సుప్రీంకోర్టులో దాఖలుచేసిన తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. 2021లో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతుల ఆందోళన సందర్భంగా మహిందర్ కౌర్ అనే వృద్ధ మహిళను కించపర్చేలా రీట్వీట్ చేశారు. ఆమె రూ.100 కిరాయికి వస్తుందని తన రీట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మహిందర్ కౌర్ పరువునష్టం కేసు వేశారు. దాంతో కౌర్ ఫిర్యాదును కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కంగనా ముందుగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆమెకు చీవాట్లు పెట్టింది. 'మీ వ్యాఖ్యలకు అర్థం ఏమిటి..? మీది సింపుల్ రీట్వీట్ కాదు. మీరు మీ సొంత కామెంట్స్ చేశారు. మసాలా జోడించారు' అని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## రేవంత్ – బీజేపీల రహస్య మైత్రికి.. ఇది తాజా ఉదాహరణ మాత్రమే! : కేటీఆర్



సీఎం రేవంత్ రెడ్డి, భారతీయ జనతా పార్టీల మధ్య కొనసాగుతున్న రహస్య మైత్రిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి.. చోటే భాయ్‌కి చీమ కూడా కుట్టకుండా బడే భాయ్ పార్టీ బీజేపీ పహారా కాస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎన్ని సమస్యలొచ్చినా.. రేవంత్ ఎన్ని స్కాములకు పాల్పడినా, బీజేపీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉంటది అని కేటీఆర్ ధ్వజమెత్తారు. గ్రూప్-1 నిర్వహణలో ఘోరమైన అవకతవకలు జరిగి ఏకంగా పరీక్షనే రద్దు చేయాలని హైకోర్టు చెప్పినా రాష్ట్ర బీజేపీ కిమ్మనదు అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం చేసిన నేరపూరిత నిర్లక్ష్యం మీద డబ్బులకు జాబులు అమ్ముకున్నారన్న ఆరోపణల మీద బీజేపీ మౌనానికి కారణమేంది ? బీఆర్ఎస్ హయాంలో ప్రతిదానికీ సీబీఐ ఎంక్వైరీ అని ఒంటికాలి మీద లేచిన బీజేపీ నేతలు గ్రూప్-1 స్కాం మీద అదే విచారణ ఎందుకు కోరడం లేదు ? రేవంత్-బీజేపీల రహస్య మైత్రికి ఇది తాజా ఉదాహరణ మాత్రమే! అని కేటీఆర్ పేర్కొన్నారు.



## డల్లాస్ లో భారత సంతతి వ్యక్తి తల నరికి హత్య

అమెరికాలోని డల్లాస్‌లో భారత సంతతి వ్యక్తి హత్యకు గురయ్యాడు. చంద్రమౌళి నాగమల్లయ్య అనే భారత సంతతి వ్యక్తి డల్లాస్ నగరంలో మోటల్ నిర్వహిస్తున్నాడు. మోటల్‌లో పని చేసే జోర్డాన్ కాబోస్ మార్టినెజ్ అనే ఉద్యోగి కత్తితో చంద్రమౌళి తల నరికి చంపాడు. చంద్రమౌళిని చంపుతున్నప్పుడు భార్య, పిల్లలు అక్కడే ఉన్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జోర్డాన్ కాబోస్ మార్టినెజ్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## అనుష్క ఇలాంటి షాక్ ఇచ్చిందేంటి.. ఇక గుడ్ బై..!



ఘాటి చిత్రం అనుష్క చాలా కాలం తర్వాత నటించిన పూర్తి స్థాయి ప్రధాన పాత్ర సినిమా కావడంతో అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అయితే సినిమా దారుణంగా ఫెయిలవ్వడంతో ఆమెపై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందని పరిశ్రమలో చర్చ నడుస్తోంది. మరీ ముఖ్యంగా, చిత్ర ప్రమోషన్లకు అనుష్క దూరంగా ఉండటంపై అప్పడే సందేహాలు మొదలయ్యాయి. సినిమా విడుదలైన వారం రోజులకి అనుష్క తన ఫేస్‌బుక్‌లో ఒక భావోద్వేగ భరితమైన పోస్ట్ పెట్టింది. నీలి వెలుగును దీపకాంతిగా మార్చుకుంటూ... సరైన జీవితాన్ని గుర్తు చేసుకోవడానికి, ప్రపంచంతో మళ్లీ కలిసిపోవడానికి కొంతకాలం సోషల్ మీడియా నుండి దూరంగా ఉండబోతున్నాను. త్వరలోనే మరిన్ని కథలతో, మరింత ప్రేమతో మీ ముందుకొస్తాను. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండండి .. ప్రేమతో మీ స్వీటీ అని అనుష్క రాసుకొచ్చింది. అనుష్క మాటలు అభిమానులను కలచివేశాయి. సినిమా ఫెయిల్యూర్ వలన భావోద్వేగానికి గురై అనుష్క ఈ నిర్ణయం తీసుకుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మరికొందరైతే ఈ విరామం ఆమెకు సెల్ఫ్-హీలింగ్ సమయంగా ఉంటుందని ఆశిస్తున్నారు. అనుష్క పోస్టులో "త్వరలోనే మరిన్ని కథలతో మీ ముందుకొస్తాను" అన్న వ్యాఖ్యలు ఆమె మరోసారి శక్తివంతమైన పాత్రలతో రానుందనే సంకేతాలు ఇస్తున్నాయి. గతంలో లావుగా మారి తన ఫిజిక్ కారణంగా విమర్శలు ఎదుర్కొన్న అనుష్క, ఇప్పుడు తన ఫిట్‌నెస్, కెరీర్‌పై మరింత దృష్టి పెట్టబోతున్నట్లు ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.